క్లుప్తంగా

కొత్త హుండీల ఏర్పాటు



కొత్త హుండీలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార: నక్కవానిపాలెం,దేవదాయ, ధర్మదాయ శాఖ శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కొత్త హుండీలు ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పైల శేఖర్ బాబు ఆధ్వర్యంలో పాత హుండీలు తొలగించి కొత్తగా నాలుగు ఏర్పాటు చేశారు.

నేడు ,రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార : ఏపీ ట్రాన్స్‌కో గాజువాక 132 కేవీ టవర్స్ లైన్లు, తీగలు మార్పు నిమిత్తం ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్, సీతమ్మధార, సబ్ డివిజన్ పరిధిలో 11 కేవీ సీతంపేట ఫీడర్,11 కేవీ గురుద్వార్ ఫీడర్, 11కేవీ శాంతిపురం ఫీడర్లకు సంబంధించి బుధ,గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. గురుద్వార్, విజయమెడికల్, సీతంపేట, శాంతిపురం, కైట్స్ కళాశాల, జీవీకే ప్లాజా, రమా హస్పటల్, సీతంపేట, దుర్గా గణపతి ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

7న జర్నలిస్టుల ఉగాది సంబరాలు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ సంయుక్తంగా ఏప్రిల్ 7న ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అర్బన్ యూనిట్ అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు. శంకరమఠం రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఉగాది పర్వదినం ఏర్పాట్లపై సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే 7వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు నగరంలోని సింకా గ్రాండ్‌లో ఉగాది సంబరాలు ప్రారంభవుతాయని తెలిపారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం భోజనం, లక్కీ డిప్ నిర్వహిస్తామని తెలిపారు.

యూజీడీ లీకుతో అవస్థలు



మధురానగర్ రోడ్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ రోడ్డులో అసెంట్ కళాశాల వద్ద యూజీడీ మ్యాన్ హోల్ లీకవుతోంది. దీంతో మురుగు నీరు రోడ్డు పైనుంచి ప్రవహిస్తుండటంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి

సీతమ్మధార : విశాఖ నగరంలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ద్వారకా క్రైం పోలీసుల ఆధ్వర్యంలో శ్రీనగర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దొంగతనాలు జరగకుండా పోలీసులకు స్థానిక యువకులు సహకరించాలని కోరారు. అనుమానితులు కనిపిస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల న్నారు. కార్యక్రమంలో ఎస్ఐ.రాజు, ఏఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- గ్రీన్ బెల్ట్‌లో ఓపెన్ జిమ్‌లు
- పిల్లల కోసం ప్రత్యేక సౌకర్యాలు
- సౌకర్యవంతంగా వాకింగ్ ట్రాక్



విద్యుత్ వెలుగుల్లో ఓపెన్ జిమ్



తాటిచెట్లపాలెంలో ఓపెన్ జిమ్ పరికరాలు



కంచరపాలెంలో గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్

కంచరపాలెం: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలు రూపురేఖలు మారాయి. విశాఖను అగ్రస్థానంలో నిలబెట్టాలన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా జీవీఎంసీ గ్రీన్‌బెల్ట్‌లు అభివృద్ధి చేశారు. హైవేకు ఆనుకుని ఉన్న స్థలాలను ఉద్యానవనాలుగా మార్చారు. అంతటితో ఆగకుండా ఆహ్లాదం..ఆరోగ్యం పంచేలా వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రీన్‌బెల్ట్‌లు జనసంచారంతో సందడిగా కనిపిస్తున్నాయి.

గ్రీన్‌బెల్ట్‌ల ఆధునికీకరణ

పాదచారులు, వాహనదారులు గ్రీన్‌బెల్ట్‌లో సొగసు చూసి మురిసిపోయేలా ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఉత్తర నియోజకవర్గ పరిధి 46,47, 54, 55వార్డుల్లో తాటిచెట్లపాలెం, కంచరపాలెం, 104 ఏరియా, మర్రిపాలెం ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, చల్లా రజినీ జీవీఎంసీ నిధులతో నిర్మించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తాటిచెట్లపాలెం కూడలి, సంజీవయ్యకాలనీ, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, కంచరపాలెం, ఊర్వశికూడలి, 104 ఏరియా, వద్ద ఉన్న గ్రీన్‌బెల్ట్‌లను అభివృద్ధి చేశారు. గ్రీన్‌బెల్ట్‌తో వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుతో పాటు అధునాతన వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉదయం సాయంత్రం వేళల్లో పిల్లలు, పెద్దలు, వాకర్స్ సభ్యులు సేదతీరుతున్నారు.

అందరికీ అందుబాటులో..



గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయడంతో అందరికీ ఉపయోగపడుతోంది. గ్రీన్‌బెల్ట్ ఏరియాలో విద్యుత్ లైట్లు కూడా ఏర్పాటు చేశారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఎంతో శ్రద్ధ తీసుకోవడం వల్లే గ్రీన్‌బెల్ట్‌లో సౌకర్యాలు మెరుగుపడ్డాయి.

– కె.రామారెడ్డి, కంచరపాలెం

ఎంతో సౌకర్యంగా..



గ్రీన్‌బెల్ట్ సుందరంగా తీర్చిదిద్దడం వల్ల అందరికీ సౌకర్యవంతంగా ఉంది. వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. కోవిడ్ తరువాత పిల్లలు, పెద్దలు అంతా వ్యాయామానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక్కడ వ్యాయం చేయడానికి మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నా.

– కుప్పల త్రివేణి, వాకర్, ఊర్వశికూడలి

ఆరోగ్యమే ముఖ్యం...



హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్‌ల అభివృద్ధితో ఆ రహదారిలో ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. వీటిని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్రీన్‌బెల్ట్‌ల్లో వాకింగ్ ట్రాక్స్, తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం.

– కటుమూరి సతీష్, డిప్యూటీ మేయర్

వైభవంగా పైడిమాంబ జాతర



అమ్మవారి సన్నిధిలో ఆదారి ఆనంద్



ఆలయంలో భక్తుల సందడి

కంచరపాలెం: రామ్మూర్తిపంతులపేట వాసుల ఆరాధ్య దైవత పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ పరిసరాల్లో భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. అమ్మవారి ప్రతిమలతో రైల్వే గేటు వద్ద గల మూలవిరాట్ నుంచి తిరువీధి నిర్వహించారు. సుమారు 298 ఘటాలు మూలవిరాట్ వద్ద నుంచి బయల్దేరాయి. కోలాటాలు, తప్పెటగుళ్లు, నేలవేషాల నడుమ అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. అనంతరం ప్రధాన ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ, ఉత్తర నియోజకవర్గ అభ్యర్థులు ఆదారి ఆనంద్‌కుమార్, కేకే రాజు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాధ్యక్షుడు దాడి గోవింద్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏటీఆర్ ట్రస్టు సభ్యులు భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పైడిమాంబ టాటా ఏస్ సంఘం సభ్యులు వి.పైడిరాజు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యంగిరా దేవికి అభిషేకం



అభిషేకంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో మంగళవారం సాయంత్రం రాహుకాల సమయంలో శ్రీప్రత్యంగిరా అమ్మవారికి విశేష అభిషేకం చేశారు. అర్చకుల వేదమంత్రాల మధ్య అమ్మవారి ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం అర్చన గావించి, అమ్మవారి విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించారు. ప్రత్యంగిరా దేవిని పూజించడం వల్ల శతృనాశనం, కోర్టు కేసుల్లో విజయం, ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని అర్చకులు తెలిపారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజాశాంతి అభ్యర్థుల గెలుగే లక్ష్యం : బాబూ మోహన్



మాట్లాడుతున్న బాబూ మోహన్

తాటిచెట్లపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాశాంతి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నేత, ప్రముఖ సినీ నటుడు బాబూ మోహన్ కోరారు. విశాఖ ఎంపీగా కేఏ పాల్‌ను అత్యధిక మెజార్టీ గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రైల్వేన్యూకాలనీలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు, దేశానికి కేఏ పాల్ సేవలు ఎంతో అవసరమన్నారు. తెలుగుదేశం, బీజేపీ తనను వాడుకుని వదిలేశాయన్నారు. ఈ ఎన్నికలలో ప్రజాశాంతి పార్టీ తరఫున వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నానని తెలిపారు. సమావేశానికి ముందుగా ప్రజాశాంతి పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేశారు. కార్యక్రమంలో ప్రజాశాంతి పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జిలుకర రవికుమార్, జాతీయ కో ఆర్డినేటర్ బాబోజీ రావు, పార్లమెంట్ విశాఖ ఇంచార్జి రెడ్డి యేసుపాదం, పార్టీ నాయకులు మేకల శుభాకర్, ఎం .భవాని పాల్గొన్నారు.

ఇగ్నోలో అడ్మిషన్లకు గడువు పెంపు

గాజువాక : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో అడ్మిషన్ల గడువును ఈ నెల 31 వరకు పెంచినట్టు వర్సిటీ గాజువాక స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ ఎస్.వి.కృష్ణ తెలిపారు. యూనివర్సిటీ అందిస్తున్న అన్ని సర్టిఫికెట్ డిప్లమా, పీజీ డిప్లమా, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఎంబీఏ ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. http:// ignouadmission.samarth.edu. in ద్వారా ప్రవేశాలను పొందవచ్చని పేర్కొన్నారు. వివరాల కోసం ఎంవీఆర్ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో గాని, 0891–3514734 నంబర్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం కలుగుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1139వ రోజు, మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా భాగస్వామ్యంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అద్దంలా మెరుస్తున్న రహదారి



మెరుస్తున్న రామాటాకీస్ రోడ్

సీతంపేట: మౌలిక సదుపాయాల కల్పనకు యంత్రాంగం పెద్దపీట వేస్తోంది. అభివృద్ధి పనులతో నగరంలో రహదారులు అద్దంలా మెరుస్తున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రామాటాకీస్, స్వర్ణభారతి స్టేడియం మీదుగా మద్దిలపాలెంకు వెళ్లే రహదారి కొత్తగా బీటీ రోడ్ వెయ్యడంతో రహదారి కళకళలాడుతోంది. నిత్యం రద్దీగా ఉండే రహదారి చిన్నచిన్న గోతులతో వాహనచోధకులకు ఇబ్బందిగా ఉండేది. అభివృద్ధి పనుల్లో భాగంగా రెండురోజులుగా బీటీ రోడ్ నిర్మాణ పనులు చేపట్టారు. రహదారి అభివృద్ధితో ప్రయాణం సాఫీగా సాగుతోందని వాహనచోధకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



మృతుడు అప్పారావు

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవరు మృతి చెందిన ఘటన ఫోర్తుటౌన్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..కైలాసపురానికి చెందిన గరికిన అప్పారావు (56) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని మంగళవారం రాత్రి 10.05 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న సమయంలో రైల్వేగేటు సమీపంలోని కాళీ కామాత ఆలయం వద్ద కుక్క అడ్డురావడంతో షడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. అప్పారావు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ. వాణిశ్రీ తెలిపారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం

మహారాణిపేట: గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా ట్రైనింగ్ టీం ఆధ్వర్యంలో దక్షత శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. 3 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి గర్భవతి 12 వారాలలోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (యూపీహెచ్‌సీ)ల్లో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. దీని కోసం పారా మెడికల్ సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. మాతా–శిశు మరణాలు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో క్లాత్ బ్యాగుల ఏటీఎం

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో సోలార్‌తో పని చేసే క్లాత్ బ్యాగుల పంపిణీ ఏటీఎంను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ సంచులకు బదులుగా ఇక్కడ క్లాత్ బ్యాగులను ఈ ఏటీఎం ద్వారా వినియోగదారులు పొందవచ్చు. ఎన్జీవో సంస్థ జన కల్యాణ్ సమైక్య ఏర్పాటు చేసిన ఈ ఏటీఎంను జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం క్లాత్ బ్యాగులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారుల కోసం మొదటి సారిగా క్లాత్ బ్యాగులు పంపిణీ చేసే ఏటీఎం యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది సోలార్ పవర్‌తో పని చేస్తుందన్నారు. దీనిలో 500 క్లాత్ బ్యాగులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బ్యాగు ధర రూ.10 అని తెలిపారు.

ఏటీఎంలో రూ.10 కాయిన్ గానీ, నోటు గానీ, రెండు రూ.5 కాయిన్లు గానీ వేస్తే ఒక క్లాత్ బ్యాగు బయటకు వస్తుందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, సిబ్బంది, జన కల్యాణ్ సమైక్య ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. జీవీఎంసీ 46వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సాయంత్రం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు అంతా సైనికుల్లా పనిచేయాలన్నారు. బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో 46వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ విజయానికి ఎలా కృషి చేశారో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సేనాపతి అప్పారావు, గోవింద్, నరసింగరావు, చిన్న, లావణ్య, ఎం.వి.రమణ, రామారావు, ఈశ్వరరావు, వి.అప్పారావు, రాజు, దుర్గా భవాని, తదితరులు పాల్గొన్నారు.

8 కేజీల గంజాయి స్వాధీనం



రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయితో ఉన్న బ్యాగ్‌ను విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం... డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు(డీఎస్ఆర్పీ), బి మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ జి. శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎఎస్ఐ అనంతరావులు తమ తమ సిబ్బందితో మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో అజ్ఞాత వ్యక్తి ఓ బ్యాగును విడిచిపెట్టి వెళ్లిపోయాడు. ఈ బ్యాగును తనిఖీ చేయగా ఇందులో సుమారు రూ.40వేలు విలువ 8 కేజీల గంజాయిని గుర్తించారు. బ్యాగ్‌ను సీజ్ చేసినట్లు జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఓటు ప్రాముఖ్యత తెలిపే చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట: ఓటు హక్కు ప్రాముఖ్యత తెలిపే చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్' అని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. నెలవారీ సినిమా ప్రదర్శనలో భాగంగా మంగళవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మార్టిన్ లూథర్ కింగ్ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వెయ్యడం మన హక్కు అని, ప్రజలకు ఉన్న అతిపెద్ద ఆస్తి అని అన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరూ తప్పని సరిగా ఓటు వెయ్యాలన్న అంశంతో రూపొందించిన చిత్రమని, అందరూ చూడదగినదని అన్నారు. ఈ చిత్రంలో నటించిన నగర కళాకారులు ఇమంది ఈశ్వరరావు, కేసీహెచ్.గోపి నాయుడు, మల్లికలను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమీక్షా కార్యక్రమంలో బి.చిన్నారావు, ఉషారాణి, కృష్ణారావు, కాశీవిశ్వేశ్వర రావు, సుధాకర్, ప్రభు, చాటల బాబూరావు రెడ్డి పాల్గొన్నారు.

24 దరఖాస్తుల తిరస్కరణ



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

సీతమ్మధార : ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఆయా పార్టీ అభ్యర్థులు 48 గంటల ముందు అనుమతులు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల అధికారిణి డి.అఖిల స్పష్టం చేశారు. లౌడ్ స్పీకర్లు, తాత్కాలిక పార్టీ కార్యాలయాలు, కరపత్రాల పంపిణీ, వాహనాలకు అనుమతులు, వార్డులో సమావేశాలకు సంబంధించి 48 గంటల ముందు అనుమతులు తీసుకోవాలన్నారు. ఇందుకోసం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు పలు రాజకీయ పార్టీల నుంచి 70 దరఖాస్తులు వచ్చాయని, అందులో 24 రిజెక్ట్ చేశామన్నారు. వీటికి పోలీసులు అనుమతి లేనందుకు రిజెక్ట్ చేశామన్నారు.

వెండి పళ్లెం బహూకరణ



ముత్యమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులకు వెండి పళ్లెం అందజేస్తున్న దృశ్యం

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి గుండా పెద్ద దివాణం అర కిలో వెండి పళ్లెం మంగళవారం ముత్యమాంబ అమ్మవారికి వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ముత్యమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు కూండ్రపు సన్యాసినాయుడు, కూండ్రపు చిన్నంనాయుడు, కూండ్రపు మధు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



బాబా ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవకులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని దేవదాయ, ధర్మదాయ శాఖ శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో హుండీ ఆదాయాలను మంగళవారం లెక్కించారు. లాసెన్స్ బే కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో శ్రీనివాసరావు సమక్షంలో శ్రీవారి సేవకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 75 రోజులకు రూ.6,25,352 ఆదాయం వచ్చినట్లు శ్రీ షిర్డీసాయిబాబా ఆలయ ఈవో శేఖర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వనజాక్షి, శివ తదితరులు పాల్గొన్నారు. నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. లాసెన్స్‌బే కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో బి. శ్రీనివాసరావు సమక్షంలో శ్రీహరి సేవకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ఈవో శేఖర్‌బాబు మాట్లాడుతూ 75 రోజులకు రూ.1,57,000 ఆదాయం వచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో అర్చకులు రామారావు శర్మ, మహేష్, ఆర్. చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.